Chekumukirayi

Long Poem on Telangana

Juluru Gowri Shankar

[illegible]
[illegible]
[illegible]
[illegible]
[illegible]
[illegible]
[illegible]
[illegible]
[illegible]
[illegible]
[illegible]
[illegible]
[illegible]
[illegible]

చెకుముకిరాయి

[illegible]

తెలంగాణ దీర్ఘకవిత



జూలూరు గౌరీశంకర్

చెకుముకిరాయి

మోదుగుల పొదుగు తెలంగాణ

తెలంగాణ దీర్ఘకవిత

జూలూరు గౌరీశంకర్

స్పృహ సాహితీ సంస్థ
హైదరాబాద్

చెకుముకిరాయి
మోదుగుల పొదుగు తెలంగాణ
తెలంగాణ దీర్ఘకవిత

జూలూరు గౌరీశంకర్

ప్రచురణ : స్పృహ సాహితీ సంస్థ

కవర్ డిజైన్ & బొమ్మలు : ఏలే లక్ష్మణ్

ప్రతులకు : రాష్ట్రంలోని అన్ని పెద్ద పుస్తకాల షాపుల్లో

జూలూరు గౌరీశంకర్
జర్నలిస్ట్
1-8-702/33/20ఏ
పద్మాకాలనీ, నల్లకుంట
హైదరాబాద్ - 44.

ప్రచురణ కాలం : 2006 నవంబరు

వెల : రూ. 5/-

ముద్రణ : చరిత ఇంప్రెషన్స్
అజామాబాద్, హైదరాబాద్.
ఫోన్ : 2767 8411

తల్లి తెలంగాణ
కలల సాకారం కోసం
పోరాట పతాకలైన వారందరికీ . . .

ఇది ఇక
తెగ తెంపుల సంగ్రామం


తెగిస్తేనే తెలంగాణ సాధ్యం
నాలుగు వేల ప్రాణాలను
నాడు మేమిచ్చినం
ఆ జై కొట్టిన అమరులు
మాకు కసి నేర్పింద్రు
ఇగ తాడో పేడో
ఇంగ సావో బతుకో
తెలంగాణే మన మంత్రం
తెలంగాణే మనవేదం



జైత్రయాత్ర
జైత్రయాత్ర
జై కొట్టు తెలంగాణ
రంకెట్టు తెలంగాణ
పరిగెత్తు తెలంగాణ
నిలువెత్తు తెలంగాణ
నిలబెట్టు తెలంగాణ
ఉరకలెత్తు తెలంగాణ
ఇది ఇక తెగదెంపుల సంగ్రామం
తెగిస్తేనే తెలంగాణ.

ఇది మన మంది ఆశ
ఇది మన జనమందుకున్న ఆశ
ఇది రగిలి రగిలి పొగులుతున్న ఆశ
ఇది కదిలి కదిలి పగులుతున్న
పెగులుతున్న
ఉరుకుతున్న
కరుకు ఉన్న
నరకమున్న
మలినెత్తుటి శ్వాస





ఇది పగ కాదు
ఇది వొట్టి సెగ కాదు
ఇది వొట్టి కలకాదు
నిలబెట్టి పొగబెట్టి
పగబట్టి సిగబట్టి
అడుగుతున్న న్యాయం.

వేయరా ముందడుగు
దూయరా వడిసెల రాయి
దూకరా తుది సమరానికి
పలకరా నీ పలుకు
రాయరా నీ వెత
ఎన్నాళ్ళని ఆగుదాం

ఎంత కాలమని సహిద్దాం
ఇది తెగతెంపుల సంగ్రామం
తెగిస్తేనే తెలంగాణ సాధ్యం.

కాకా ఇది ఆఖరి మోకా
కేకే ఇది నీకే
ఊగిసలాటలొద్దు
ఉద్యమానికి ఉరుకులు నేర్పినోళ్ళం
పోరాటానికి పురుడు పోసినోళ్ళం

నేతలారా
మావి చేతకాని మాటలు కావు
మావి చేవ ఉన్న చేతలు
నవాబునే కూల్చిన చేతులు.



అసెంబ్లీకి బాసులారా
ఇదింకెన్నాళ్ళో సాగదని సాగుతున్నం
ఈ నేలకు మొక్కుతున్నం




సారమ్మను తలుస్తున్నం
సారక్కను పిలుస్తున్నం
నిజ చరిత్ర కారులం
జన చరిత్ర కారులం
జగచ్చరిత్ర కారులం

ఓ బైరాన్‌పల్లే లేకుంటే
ఓ కడవెండి కాలకుంటే
మునగాల పరగాణా
ముక్కోటి పాట పాడకుంటే
మీ జన్మలు చరితార్థమయ్యే
జాగే ఉండేది కాదు.

సుందరయ్యా మన్నించు
కొండపల్లీ కనికరించు
తరిమెల నాగిరెడ్డీ మా తలుపు తట్టు
చంద్రపుల్లా వెదురువిల్లై లేచి నిలబడు


తెలంగాణ వాసులారా!
చరిత్ర తెలంగాణదే
చరిత్ర ముమ్మాటికీ మనదే
మూడున్నర కోట్ల ప్రజలదే
కొమురం భీంను తలచుకుంటూ
రాండ్రి... పోదాం....
ఫెళ ఫెళ ఫెళ విరుచుకు పడదాం
ఎర్ర సెలకల్లో మొలుద్దాం
అగ్ని వృక్షాల మౌదాం
తంగెడు పూలలా తళుక్కుమందాం
బతకమ్మ పాట పాడదాం
బతుకు దెరువును మనలోనే వెతుక్కుందాం





పద... పద పద... పద పద....
పాటలు పాడుకుంటూ పోదాం
వ్యూహాలు అల్లుకుంటూ నడుద్దాం
ఊరు మనదేరా - బడిత మనదేరా
మనమీద వాడేందిరా - వాడేలే దేందిరా
పోరు తల్లికి పురిటి నొప్పులం మనం
ఓరుగల్లును హోరుగల్లుగా మార్చింది మనం
సిద్దిపేటలం మనం
కరీంనగరాలం మనం
కంచు నగారాలం మనం
నిజామాబాద్‌లం మనం
నిజాం ఆజాద్‌లం మనం
నల్లగొండలం మనం
పోరాటానికి అండదండలం మనం

ఖమ్మంలం మనం
జనచైతన్య గుమ్మాలం మనం
మహబూబ్ నగర్లం మనం
మహబ్బత్ తో పెరిగినోళ్ళం
ఆదిలాబాదులం మనం
నదిలా పారినోళ్ళం మనం
మెదక్‌లం, రంగారెడ్డులం
హైదరాబాద్‌లం
పది జిల్లాలం మనం
పరమోన్నత ఖిల్లాలం మనం
మన నేల పోరాటాల ప్రయోగశాల





దొరల గడీల మీద ఉక్కు పిడికిళ్ళం మనం
దేశ్‌ముఖ్‌లను తరిమినోళ్ళం
జాగీర్దారులను మట్టి కరిపించినోళ్ళం
మనం కదిలితే చాలు కలకలమే
మనం మెదిలితే చాలు మహాప్రళయమే

ఎంతయినా మనమే
ఏదైనా మనమే
ఏమైనా మనమే
ఏనాటికైనా మనమే

అందుకే అంటున్నా
ఇది తెగదెంపుల సంగ్రామం

తెగిస్తేనే తెలంగాణ సాధ్యం
మనం కదిలితే కలకలం
మనం మెదిలితే మహాప్రళయం.


కల్లంకాడ పొలికట్టెలం మనం
కుప్పల మాయగాళ్ళు వాళ్ళు
తత్వం చెప్పేటప్పుడు
ఉసికదంతులం మనం
గురితప్పని రాయి మనది
ఎవరు నిలుస్తరో చూద్దాం





అమ్మతోడు
ఇయ్యి మాటలుగావు
మనం గెలుస్తమే -
పోరాట పొద్దులై పొడిసినోళ్ళం మనం
కుట్రదారులు వాళ్ళు
మనయి త్యాగాలు - వాళ్ళయి వ్యాపారాలు
మనయి స్వేచ్ఛగొంతులు - వాళ్ళయి ఆధిపత్యకబ్జాలు
ఎవరు నిలుస్తరో చూద్దం
ఎగసి పడ్డ నీళ్ళ మత్తడి
ఎర్ర కళ్ళ కలలు పగిలి
పొక్కిలైన నేల ఇది
మన బాధలు రంపపు కోతలు
తీరని యమ గోసలు

ఇంత జేసినా
ఎంత జేసినా
నిరాశే ఎరగని ఫినిక్స్‌లం మనం
ఉసిళ్ళలా రాలినోళ్ళం
కుట్ర నా కుట్రలకు బలై నోళ్ళం
భూమి పొరలు తొలుచుకొచ్చిన
మందు పాతర్లం
ఇక పాతరే... పాతర
ఇక జాతరే... జాతర
ఎవళ్ళు మిగుల్తరో చూద్దాం
మనం భూ పోరాట రణస్థలులం
రాజకీయ రంగస్థల నటులు వాళ్ళు
ఎవరు గెలుస్తరో చూద్దాం





యాభై ఏళ్ళ కుట్రలు
కళ్ళలో గుక్కుకున్నోళ్ళం
వాళ్ళ ఆధిపత్య అహంకారాన్ని
భరించి మన్నించినోళ్ళం
గౌతమ బుద్ధులం మనం.
గౌతమీ పుత్ర దానకర్ణులం మనం
రోజూ శిలువెక్కుతున్న
ఎన్‌కౌంటర్ క్రీస్తులం మనం
ఏ సాయమూ అందని కాస్ట్రోలం
మన నేల మీద మనమే పోరాడుతున్న
పాలస్తీనీయులం
ఇన్నేళ్ళ - ఇన్నినాళ్ళ అణచివేత
ఏ జాతికుంది.

ఇది జాతి పోరాటం - ఇది నీతి పోరాటం
ఇది వంచన మీద పోరాటం
ఇప్పుడిక తెగదెంపుల సంగ్రామం
తెగిస్తేనే తెలంగాణ సాధ్యం.


మనకు తండ్లాట కొత్త కాదు
ఇది యుద్ధకాండ
ఇది కలబడే సమయం
ఇది కలిసి నిలబడే కాలం
మనం పోరుల్లో ఎన్నడు ఓడినం?
అమ్మకంతో కమ్మకంతో కుమ్మిందెవరు?
మనల్ని కమ్మిందెవరు?
మనల్ని వరల్డ్ బ్యాంకుకి అమ్మిందెవరు?
మనల్ని మరిపించిందెవరు
మట్టి కరిపించిందెవరు?





లేవంఁడ్రా లేవండి
ముండ్ల గఁర్రలై... పొన్ను గఁర్రలై
జొన్న కంకులై
ఎఁర్రనెఁర్రని కలల అలలై
కల్లోలమై లేవండి
సంక్షోభమై నిలవండి
సంరంభమై నడవండి
దగాపడ్డ తనం నుంచి
గాయపడ్డ గుండె నుంచి
ఎండిన పఁర్రెల నుంచి
నిండిన కన్నుల నుంచి
నెత్తురై ఉబకండి

ఎవడిమాట వినకండి
ఎవడి వెనక నడవకండి
కలలతో నడవండి
కలకాలం నిలవండి
ఎదురెవడొస్తడొ చూడండి
వెనక ఎవడు నిలుస్తడో అడగండి
ఓర్నీ . . .
ఆనాడు
అలనాడు
పలనాడు
పాతనాడు
కొత్తనాడు
నానాడు ఏనాడు మాదని
ఈనాడు నడగండి
ఈనాడే అడగండి.








ఓర్నీ....
ఆర్నీ...
ఆర్మీ
ఎవరెట్ల కదలాలో... ఎటువైపు కదలాలో
అసెంబ్లీల కాదు చూడాల్సింది.
ఉద్యమ లే ఔట్లు యాడమంది గీస్తరు
ఏ గడపనైనా తొక్కు
యాడ జూసినా ఇరగ గాసే మొగిలయ్యలు
యాడ జూసినా ఇరగ బూసే అయిలవ్వలు
ఒక్కసారి తల్చి చూడు భీమ్‌ను
కర్కశ రాజ్యాలు గజగజలాడాల
మా దొడ్డి కొమురయ్య అమరత్వమే కదా
ఈ దేశానికి భూ సంస్కరణల నిచ్చింది.
మేం నేల కోసం నేల కొరిగిన త్యాగధనులం

మీరు నేలను అమ్ముకుంటున్న బేహారులు
అందుకే అంటున్న
ఇది తెగదెంపుల సంగ్రామం
తెగిస్తేనే తెలగాణ సాధ్యం

మావి కన్నీళ్ళు కావు
ఆ కళ్ళ నీళ్ళు నేల రాల్తే జాలు
పాట పరవశిస్తది... తుడుం మోత మోగుద్ది
మా బాధల్ని మేం యిస్సిరి కొడ్తే చాలు
కవిత్వం కదం తొక్కుతది
మా వాళ్ళను తలుచుకుంటే చాలు
నేల నేలంతా పులకరించి
కవిత్వం నయాగరా జలపాతమైద్ది





మీవన్ని వంకరటింకర కంకర మాటలు
మాది గుండెలు తాకే కవిత్వోద్యమ జేగంటలు
అసలు కవిత్వమంతా నాది
ఆధిపత్యం మీదా
ఇంకెన్నాళ్ళు చెలాయిస్తరు?
గద్దదిగో సూస్కో... తెలంగాణ ధూం... ధాం.
గజ్జెలు... గొంగళి... డప్పు
మండుతున్న సింగరేణి బొగ్గు
ఆదిలాబాదు అడవి అంటుకున్న మంట
పోరుగల్లు పెట్టింది సూడు పోరుమంట
అసలు... మేం లేకుండా
మీకు వజ్రాయుధ మెక్కడది?
త్వమేవాహానికి చిరునామా ఏది?
మొగిలిచర్ల నీళ్ళే తాగక పోతే
ఉద్యమం నెలబాలుడెక్కడ?
ఈ మట్టిని ఒంటికి పూసుకోకపోతే
నేత్ర ధనుస్సుల్లేవు
ఆసుపత్రి గీతాలూ లేవు
మా సావులు లేకుండా మీకు మహాకావ్యాలెక్కడివి?

ఇప్పుడు... ఆధిపత్యానికి
తెలంగాణ నీళ్ళొదులుతోంది
మళ్ళీ తెలం'గానం'
ఓ బతుకమ్మ పాటై పుట్టుకొస్తది
కవనమంతా మాది... ఆధిపత్యమంతా మీదా?
ఆ అంటే ఆత్మగౌరవం, ఆయుధమనే తెలుసు మాకు



ఆధిపత్యమనేదే ఎరగనోళ్ళం మేం
శ్రీశ్రీ, గురజాడ, రావిశాస్త్రిల
ఫోటోలు పటం కట్టుకుని తిరిగినోళ్ళం
వాళ కవిత్వాన్ని వాడవాడలా పాడినోళ్ళం
మాకు కుట్రలు తెల్వవు, కుతంత్రాలు మేం నేర్వలె
ఎన్నడైనా మీ ఊళ్ళల్లో మా కాళోజీ పటం పెట్టిండ్రా
ఎన్నడైన మీ ఊళ్ళల్లో మా కాళోజీ పటం పెట్టిండ్రా
వట్టికోట, దాశరథిలను తలిసిండ్రా
మాది తెనాలే... మీది తెనాలే అనుకున్నరు
గానీ
తెలంగాణ కవులను యాజ్జేసిన్రా
అందుకే... ఇప్పుడంటున్నం...
సురవరం మమ్ముల మన్నించు

ఇది తెగదెంపులకై సంగ్రామం
తెగిస్తేనే తెలంగాణ సాధ్యం

నీతికి ఎప్పటికైనా మేం బాంచన్లమే
ఎప్పుడైనా తిరగబడే ముండ్ల గర్రలమే
బైటపడ్డ పేగుల్ని ఒక చేత్తో అదిమిపట్టి
శత్రువుపై దూకిన
గొట్టి ముక్కలం
కాయలు కాసిన కాళోజీ కళ్లవి
దూలపాటల్లో దునుమాడిన అడుగులివి
ఈ యాసనే శ్వాస - తెలంగాణే మా అసలు భాష
రోకలి దెబ్బల కింద జొన్నలం
ఏ ద్రోహం తెలియని గటకలం
ఎండినోళ్ళం... పండినోళ్ళం... రాలినోళ్ళం





జీవిక మా హక్కు
మేం చిరుగుగుడ్డల కుచేలులం
రియల్ ఎస్టేట్ల కుబేరులం కాం
మా అరుపులు మీకొక సరదా
మా అలకలు మీకొక ప్రహసనం
మా నేతలు మీకొక రాజకీయ విదూషకులు

బిడ్డా
గీ మీడియా కూడా మనది కాదురా
అదీ ఓ ఆధిపత్యానికి కేంద్రమేరా
అది ఓ ఆంధ్రా బుష్‌గాడి కంపెనీయేరా
ఉద్యమాన్ని తెర వెనుక నుంచి
హతమార్చే చిన్న తెరరా

ఉద్యమంటే మన చేతుల్లో పూసేది
ఉద్యమమంటే కార్పోరేటాసుపత్రికాదు
చీరలు కొట్టు కాదు
ప్లాట్ల వ్యాపారం కాదు
సిలికాన్ వ్యాలీ కాదు
కంప్యూటర్‌ల సామ్రాజ్యం కాదు
కేశినేని ట్రావెల్స్ కాదు
చందన బ్రదర్స్ కాదు
కుందనాల బొమ్మ కాదు
కాకినాడ కాజా కాదు
ఎగుమతి కోసం పెట్టిన పచ్చడి సీసా కాదు
మా నేల మీద కట్టిన స్టూడియో కాదు.





ఉద్యమమంటే మా బతుక్కు పూసిన
అగ్గి పువ్వు
అగ్గి పువ్వు మీద ఇప్పుడు రెండు కత్తులు
ఒకటి ఆంధ్రా
రెండు అమెరికా
ఇద్దరూ ఒక్కటే
ఇద్దరిదీ వ్యాపారమే
వాళ్ళదెప్పుడూ మాయాలాంతరే

మహనీయుడా మార్క్స్
నువ్వెక్కడున్నావయ్యా
ఏ పెట్టుబడి గిట్టల కింద నలిగిపోతున్నావ్

ఏ విదర్ అనే పుస్తకాల్లో తప్పుడు వాక్యమై
అన్వయింపబడుతున్నావ్
ఏ చరిత్రాంశాల సిద్ధాంతాల్లోంచి
పైకి లేచేందుకు ప్రయత్నిస్తున్నావ్
రావయ్యా రా... దిగిరా...
ఎవరి పక్కన నిలబడతావో చెప్పు
ఏ దిక్కున మము నిలబెడతావో చెప్పు

మేం తెరుస్తున్నది నాలుగో కన్ను
రెండో ఎస్సార్సీ కాదు
కన్నెత్తితే చాలు వలస గోడలు పగులుతాయ్
మేం విప్పేది అబద్ధాల పెదవులు కాదు
మూడున్నర కోట్ల జనహృదయాలు
మేం తొక్కేది తప్పుడు దారి కాదు
ఎప్పటికైనా మేం నడిచేది జాతీయ రహదారి
మేం సాగించేది విహారయాత్ర కాదు
పెను సమరయాత్ర, సంహార యాత్ర
జైత్ర యాత్ర
జైత్ర యాత్ర
జైత్ర యాత్ర
తెలంగాణ జైత్రయాత్ర
తుది సమరం మొదలైంది నేడు
తెలంగాణ వస్తుంది చూడు.